క్లుప్తంగా

ఎమ్మెల్యేను కలిసిన కొమ్మాల గ్రామస్తులు



ఎమ్మెల్యేకు పుష్పగుచ్ఛం ఇస్తున్న గ్రామస్తులు

అర్వపల్లి : కొమ్మాల గ్రామ ఎస్సీ కాలనీలో ముత్యాలమ్మ గుడి నిర్మాణం, కమ్యూనిటీ హాల్ ఏర్పాటు, మురుగు కాలువ నిర్మాణం తోపాటు వివిధ అభివృద్ధి పనులు చేపట్టాలని కోరుతూ జాజిరెడ్డిగూడెం పీఏసీఎస్ ఛైర్మన్ కుంట్ల సురేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో గ్రామస్తులు ఆదివారం హైదరాబాద్‌లో ఎమ్మెల్యే మందుల సామేల్‌ను కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు పుష్పగుచ్ఛం అందజేశారు. త్వరలో సమస్యలన్నీ పరిష్కరిస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చినట్లు వారు చెప్పారు. ఈ కార్యక్రమంలో సూరారపు వెంకటాద్రి, గంగదారి శ్రీనివాస్, ఎస్.సైదులు, అర్జున్, శ్రీను, శ్రీరాములు, పరమేష్, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

నేడు అర్వపల్లిలో కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

అర్వపల్లి : మండలంలోని వివిధ గ్రామాల కల్యాణ లక్ష్మి లబ్ధిదారులకు అర్వపల్లిలోని తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం ఎమ్మెల్యే సామేల్ చేతుల మీదుగా చెక్కుల పంపిణీ ఉంటుందని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మోరపాక సత్యం ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. లబ్ధిదారులు సకాలంలో హాజరై చెక్కులను పొందాలని కోరారు.

'సీడ్స్, పెస్టిసైడ్స్' యూనియన్ డివిజన్ అధ్యక్షుడిగా యాదగిరి



నూతనంగా ఎన్నికైన యూనియన్ సభ్యులు

తుంగతుర్తి : తుంగతుర్తి డివిజన్ సీడ్స్, పెస్టిసైడ్స్ అండ్ ఫర్టిలైజర్స్ యూనియన్ నూతన కమిటీని ఆదివారం నియోజవర్గ కేంద్రంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఫర్టిలైజర్స్ యూనియన్ నూతన కమిటీ అధ్యక్షుడిగా పూసపల్లి యాదగిరి, ప్రధాన కార్యదర్శిగా సోమా వెంకన్న, గౌరవ అధ్యక్షుడిగా గుండా ఈశ్వరయ్య, కోశాధికారిగా సామ నాగిరెడ్డి, ఉపాధ్యక్షులుగా కల్లెట్లపల్లి శ్రీనివాస్, మహంకాళి సూర్య నారాయణ, జాయింట్ సెక్రటరీగా కాటబత్తిన శ్రీనివాస్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

కాంగ్రెస్ సీనియర్ నాయకుడికి నివాళి



నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

అర్వపల్లి : జాజిరెడ్డిగూడెం మండల కేంద్రానికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు సైదుల యాగానందం అనారోగ్యంతో ఆది వారం మృతి చెందారు. దీంతో కాంగ్రెస్ నాయకులు నివాళులర్పించారు. మృతుడి కుటుంబీకులను పరామర్శించారు. నివాళులర్పించిన వారిలో కాంగ్రెస్ గ్రామశాఖ అధ్యక్షుడు నర్సింగ కృష్ణ మూర్తి, మండల ఉపాధ్యక్షుడు దాసరి సోమయ్య, బండారు నారాయణ, బాష బోయిన లింగయ్య, కుంభం మధు, కుంభం యాగయ్య, సైదుల రాంమూర్తి, మామిడి రాజ్ కుమార్, రాములు, వెంకటయ్య, అంజయ్య, సైదుల కిరణ్ తదితరులు ఉన్నారు.

శిథిలమైన స్తంభం తొలగింపు



పర్సాయపల్లిలో శిథిలమైన స్తంభాన్ని తొలగిస్తున్న గ్రామస్తులు

అర్వపల్లి : పర్సాయపల్లి గ్రామపంచాయతీ కార్యాలయం ఎదుట గతంలో హైమాస్ట్ లైట్ల స్తంభాన్ని ఏర్పాటు చేయగా అది పూర్తిగా శిథిలమైంది. ఎప్పుడు కూలి ఏ ప్రమాదం జరుగుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. దీంతో గ్రామస్తుల సూచన మేరకు మాజీ జెడ్పీటీసీ కొరపిడత అవిలయ్య ఆదివారం స్వచ్ఛందంగా జేసీబీని ఏర్పాటు చేసి కూలీల సాయంతో స్తంభాన్ని తొలగించి వేయించారు.

రూ.4 వేల పెన్షన్ ఇవ్వాలి

తుంగతుర్తి : ఎన్నికల ముందు ఇచ్చిన హామీ ప్రకారం రూ.4,000 పింఛన్‌ను వెంటనే అమలు చేయాలని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు తాటికొండ సీతయ్య అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఆయనతో పాటు బీఆర్ఎస్ నాయకులు శ్రీనివాస్, వెంకన్న, సంతోష్ ఉన్నారు.

'భగీరథ' నీళ్లు రాక ఇబ్బందులు

- గ్రామాల్లో తాగు నీటికి కటకట
- వారం రోజులుగా ఇదే పరిస్థితి

అర్వపల్లి : మిషన్ భగీరథ నీళ్లు సక్రమంగా రాక గ్రామాల్లో నీటికి కటకట ఏర్పడుతోంది. గత వారం రోజుల నుంచి మిషన్ భగీరథ నీళ్లు రావడం లేదు. పైనుంచే నీళ్లు సరిగా రావడం లేదని మిషన భగీరథ సిబ్బంది చెబుతున్నారు. గ్రామాల్లో పూర్తిగా మిషన్ భగీరథ నీరే ఆధారం కావడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. గ్రామపంచాయతీల రక్షిత మంచినీటి పథకాల బోర్లు ఉన్నప్పటికీ కొన్ని మాత్రమే పనిచేస్తున్నాయి. కాగా మిషన్ భగీరథ నీరు మొదలైనప్పటి నుంచి రక్షిత మంచినీటి పథకాల వినియోగం తగ్గిపోయింది.

మండల వ్యాప్తంగా 10వేల నల్లా కనెక్షన్లు..

జాజిరెడ్డిగూడెం మండలంలోని 17గ్రామపంచాయతీల పరిధిలో సుమారు 10వేల నల్లా కనెక్షన్లు ఉండగా అందులో 7వేలకు పైగానే మిషన్ భగీరథ కనెక్షన్లు ఉన్నాయి. మండలంలో 37 ఓవర్‌హెడ్ ట్యాంక్‌ల ద్వారా ఇళ్లకు నీటి సరఫరా జరుగుతోంది. అయితే గత వారం రోజులుగా మిషన్ భగీరథ నీళ్లు సరిగా రావడం లేదు. మిషన్ భగీరథ నీటిని క్రమం తప్పకుండా సరఫరా చేయాలని ప్రజలు కోరుతున్నారు. ఈ విషయమై మిషన్ భగీరథ మండల ఏఈ అశోక్‌ను ప్రశ్నించగా కొన్ని సమస్యలతో ఇబ్బంది ఏర్పడినప్పటికీ రెండురోజులకు ఒకసారి నీటిని సరఫరా చేస్తున్నామని చెప్పారు. ఒకటి రెండు రోజుల్లో సమస్య తీరుతుందన్నారు.



అర్వపల్లిలో నీళ్లు రాని మిషన్ భగీరథ ట్యాంక్

వారం రోజులుగా నీళ్లు రావడం లేదు



జాజిరెడ్డిగూడెంలోని ట్యాంక్‌బజార్‌లో వారం రోజులుగా నీళ్లు రావడంలేదు. ఈ విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లగా ట్యాంకర్ ద్వారా నీటి సరఫరా చేస్తామని చెప్పారు. కానీ చేయలేదు. నీళ్ల కోసం అనేక ఇబ్బందులు పడుతున్నాం. నీటి సరఫరాను వెంటనే పునరుద్ధరించి మా ఇబ్బందులు తీర్చాలి.

– మెరుగు మధు, ట్యాంక్ బజార్, జాజిరెడ్డిగూడెం

మిషన్ భగీరథ నీళ్లు నిలిచిపోయాయి



మిషన్ భగీరథ నీళ్లు 10రోజులుగా నిలిచిపోయాయి. దీంతో నీటి సమస్య తీవ్రమవుతోంది. పాలేరు నుంచే నీటి సరఫరా ఆగిపోయింది. కాసర్ల పహాడ్ గుట్ట వద్ద గేట్‌వాల్వ్ సమస్య ఉండగా.. సిబ్బంది మరమ్మతు చేశారు. వెంటనే మిషన్ భగీరథ నీటి సరఫరాను పునరుద్ధరించాలి.

– బింగి కృష్ణమూర్తి, జాజిరెడ్డిగూడెం

ఖాళీ పోస్టులకు దరఖాస్తుల స్వీకరణ

పెన్‌పహాడ్ : మండల కేంద్రంలోని కస్తూరిబా బాలికల పాఠశాలలో ఖాళీగా ఉన్న సహాయక వంట మనిషి మహిళా పోస్టుకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఎంఈఓ నకిరేకంటి రవి తెలిపారు. ఆదివారం మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. మండలానికి చెందిన మహిళా అభ్యర్థులు ఏడో తరగతి ఉత్తీర్ణత సాధించి 18 నుంచి 55 సంవత్సరాల వయస్సు కలిగి ఉండాలని అన్నారు. అర్హత కలిగిన వారు ఈ నెల 25 వరకు మండల వనరుల కేంద్రంలో దరఖాస్తులు అందజేయాలని సూచించారు.

నూతనకల్ : మండల కేంద్రంలోని కస్తూరిబా బాలికల పాఠశాలలో ఖాళీగా ఉన్న స్వీపర్, స్కావెంజర్ ఉద్యోగాలకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఎంఈఓ రాములు నాయక్ తెలిపారు. ఆదివారం మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. మండలానికి చెందిన మహిళా అభ్యర్థులు ఏడో తరగతి ఉత్తీర్ణత సాధించి 18 నుంచి 45 సంవత్సరాల వయస్సు కలిగి ఉండాలని అన్నారు. దరఖాస్తులను ఈ నెల 25 వరకు కస్తూరిబాగాంధీ ప్రత్యేకాధికారికి అందజేయాలని సూచించారు.

మద్దిరాల : మండల కేంద్రంలోని కస్తూరిబా గురుకుల పాఠశాలలో గల అసిస్టెంట్ కుక్-3 పోస్టులు, స్వీపర్ పోస్టు-1, స్కావెంజర్-1, డే వాచ్‌మన్-1 పోస్టుకు అర్హులైనా మహిళలు దరఖాస్తు చేసుకోవాలని మండల విద్యాధికారి రాములు నాయక్ తెలిపారు. ఆదివారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. 7వ తరగతి ఉత్తీర్ణులైన మహిళా అభ్యర్థులు ఈ నెల 25వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రమేష్‌యాదవ్‌కు సన్మానం

సూర్యాపేటటౌన్: హైదరాబాద్‌లోని ఖైరతాబాద్ ప్రెస్‌క్లబ్‌లో యాదవ్ సేవా సంఘం ఆధ్వర్యంలో ఆదివారం సూర్యాపేటకు చెందిన ప్రైవేట్ ఉపాధ్యాయుడు అరాల రమేష్ యాదవ్‌ను సన్మానించారు. ఈ సందర్భంగా రమేష్ యాదవ్ మాట్లాడుతూ తాను ప్రైవేట్ టీచర్‌గా 19 ఏళ్లుగా పని చేస్తున్నానని చెప్పారు. వృత్తి నిర్వహణలో అంకితభావంతో పని చేస్తున్నందున గుర్తింపు లభిస్తోందని పేర్కొన్నారు.



సన్మానం పొందుతున్న రమేష్ యాదవ్

గ్రీన్ క్లబ్ ట్రస్ట్ సేవలను మరింత విస్తరిస్తాం



సర్వసభ్య సమావేశంలో పాల్గొన్న గ్రీన్ క్లబ్ సభ్యులు

సూర్యాపేట : గ్రీన్ క్లబ్ ట్రస్ట్ సేవలను మరింత విస్తరిస్తామని క్లబ్ ట్రస్ట్ సూర్యాపేట అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ముప్పారపు నరేందర్, తోట కిరణ్ అన్నారు. ఆదివారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని బాలాజీ కన్వెన్షన్ హాల్‌లో గ్రీన్ క్లబ్ ట్రస్ట్ సూర్యాపేట 8వ వార్షికోత్సవ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ప్రతి ఒక్కరూ పర్యావరణ పరిరక్షణకు పాటు పడాలన్నారు. విరివిగా మొక్కలు నాటి సంరక్షిస్తేనే ముందు తరాలకు భవిష్యత్ బాగుంటుందని పేర్కొన్నారు. పెరుగుతున్న కాలుష్యానికి విరుగుడు పచ్చదనాన్ని పెంచడమేనని చెప్పారు. వాతావరణ సమతుల్యతను కాపాడాలన్నారు. పుడమికి, పర్యావరణానికి హాని చేసే సింగిల్ యూస్డ్ ప్లాస్టిక్ వాడకాన్ని ఆపివేయాలని కోరారు. ప్రతి ఒక్కరూ చేతి సంచులను, త్వరగా ప్రకృతిలో కలిసిపోయే వస్తువులనే వినియోగించాలని కోరారు. పుట్టినరోజు, పెళ్లిరోజు వంటి ప్రత్యేక రోజుల్లో మొక్కలను నాటి సంరక్షించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ గౌరవ సలహాదారు న్యాయవాది శశిధర్, పీఆర్ఓ గండూరి కృపాకర్, సుధాకర్ పీవీసీ అధినేత మీలా మహదేవ్, ముప్పారపు నాగేశ్వరరావు, గండూరి ప్రకాష్, చల్లా లక్ష్మీకాంత్, మిర్యాల వెంకటేశ్వర్లు, ఉప్పల శ్రవణ్, లక్ష్మీనారాయణ, యోగా గురువు చాడ పాపిరెడ్డి, భాస్కరాచారి, దేవరశెట్టి నాగరాజు, పలువురు నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

పల్లె ప్రకృతి వనాలపై పట్టింపు కరువు

- పిచ్చిమొక్కలు, గడ్డితో నిండిన ప్రకృతి వనాలు
- నిర్వహణ లేక నిరుపయోగంగా మారుతున్న వైనం



పెన్‌పహాడ్‌లో పిచ్చి మొక్కలతో నిండిన పల్లె ప్రకృతి వనం

పెన్‌పహాడ్ : పట్టణాలకు దీటుగా పల్లెల్లో పార్కులు ఉండాలనే లక్ష్యంతో ప్రభుత్వం ప్రతి గ్రామంలో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులతో పల్లె ప్రకృతి వనాలను ఏర్పాటు చేసింది. అప్పట్లో పల్లె ప్రకృతి వనాల్లో ఎంతో మంది ప్రయాణికులు, పాదచారులు సేద తీరేవారు. కానీ రాను రాను వాటి నిర్వహణ సరిగాలేకపోవడంతో ప్రస్తుతం నిరుపయోగంగా మారాయి. పల్లె ప్రకృతి వనాల్లో పిచ్చిమొక్కలు, గడ్డి ఏపుగా పెరిగి కనీసం కూర్చునేందుకు కూడా అనువుగా లేకుండా ఉన్నాయి.

పెన్‌పహాడ్ మండలంలో ఇలా..

పెన్‌పహాడ్ మండలంలో 29 గ్రామ పంచాయతీలుండగా కొన్ని గ్రామాల్లో మాత్రమే పల్లె ప్రకృతి వనాలు వినియోగంలో ఉన్నాయి. అప్పట్లో పల్లె ప్రకృతి వనాల ఏర్పాటుకు రూ.లక్ష నుంచి రూ.10 లక్షల వరకు ఖర్చు చేశారు. కానీ ఆ తర్వాత నిర్వహణ లేకపోవడంతో చాలా గ్రామాల్లో ప్రకృతి వనాలు నిరుపయోగంగా మారాయి. కొన్ని చోట్ల మందుబాబులకు అడ్డాగా మారాయని ప్రజలు తెలుపుతున్నారు. అధికారులు స్పందించి ప్రకృతి వనాల్లో పెరిగిన పిచ్చి మొక్కలు, గడ్డిని తొలగించి వినియోగంలోకి తీసుకురావాలని పలువురు కోరుతున్నారు.

వినియోగంలోకి తీసుకురావాలి

పల్లె ప్రకృతి వనాలను అనువుగాని స్థలంలో ఏర్పాటు చేశారు. ప్రస్తుతం వాటిల్లో పిచ్చి మొక్కలు పెరగడంతో కూర్చునేందుకు అనువుగా లేవు. కొన్నిచోట్ల ప్రకృతి వనాలు మందుబాబులకు అడ్డాగ మారాయి. ప్రకృతి వనాల్లో వాకింగ్ ట్రాక్, పిల్లలు ఆడుకునేందుకు వివిధ రకాల వస్తువులను ఏర్పాటు చేసి వినియోగంలోకి తీసుకురావాలి.

– రమేష్, పెన్‌పహాడ్

అందుబాటులోకి తీసుకొస్తాం



గ్రామాల్లోని పల్లె ప్రకృతి వనాలను అందుబాటులోకి తీసుకువస్తాం. వర్షాల వల్ల కొన్ని పల్లె ప్రకృతి వనాల్లో గడ్డి, పిచ్చి మొక్కలు పెరిగాయి. వాటిని గ్రామ పంచాయతీ సిబ్బందితో తొలగిస్తాం. మండలంలో చాలావరకు పల్లె ప్రకృతి వనాలు వినియోగంలో ఉన్నాయి.

– వెంకటేశ్వరరావు, ఎంపీడీఓ

ఆయిల్‌పామ్ సాగుతో అధిక లాభాలు



నాగారంలో ఆయిల్‌పామ్ మొక్కలను నాటుతున్న ఫీల్డ్ ఆఫీసర్ అశోక్

నాగారం : నీటి వసతి ఉన్న రైతులు ఆయిల్‌పామ్ తోటలను సాగు చేసి అధిక లాభాలు పొందవచ్చని పతంజలి తుంగతుర్తి డివిజన్ ఫీల్డ్ ఆఫీసర్ పి.అశోక్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో ఆయిల్ పామ్ మేఘ ప్లాంటేషన్ డ్రైవ్‌లో భాగంగా రైతు కడారి నర్సింహారెడ్డి వ్యవసాయ క్షేత్రంలో నూతనంగా ఆయిల్‌పామ్ మొక్కలను నాటే కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడారు. మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉన్న ఆయిల్ పామ్ తోటల సాగుపై రైతులు దృష్టి సారిస్తే ఆర్థికంగా అభివృద్ధి చెందవచ్చని అన్నారు. ఆయిల్‌పామ్ తోటలు సాగు చేయాలనుకున్న ఆసక్తి గల రైతులు ఉద్యాన శాఖ అధికారులకు దరఖాస్తు చేయలని కోరారు. ఈ కార్యక్రమంలో పతంజలి క్షేత్ర సహాయకులు రంగు ముత్యంరాజు, రైతులు నరేష్‌రెడ్డి, కడారి సరళ, రమేష్, గణేష్ పాల్గొన్నారు.

ఉండ్రుగొండలో లక్ష్మీసహస్రనామ పారాయణం

చివ్వెంల : మండల పరిధిలోని ఉండ్రుగొండ శివారులోని శ్రీ లక్ష్మీ నర్సింహస్వామి ఆలయం, శ్రీ లక్ష్మీ సమేత హయగ్రీవ ఆలయం, శ్రీ ఉమామహేశ్వర స్వామి ఆలయాల్లో ఆదివారం లక్ష్మీ సహస్రనామ పారాయణం నిర్వహించారు. విష్ణు సహస్రనామ పారాయణంను చదివి వినిపించారు. అనంతరం భక్తులు అన్నదానంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో నాగయ్య, రంగినేని సుధాకర్ రావు, ప్రసన్న, చంద్రశేఖర్, పద్మావతి, ఈగ రామయ్య పలువురు భక్తులు, తదితరులు పాల్గొన్నారు.



పారాయణం చేస్తున్న భక్తులు

నూతన కమిటీ ఎన్నిక

మునగాల : ఐద్వా మహాసభల అనంతరం మండల నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షురాలుగా బచ్చలకూరి మంగమ్మ, కార్యదర్శిగా జూలకంటి విజయలక్ష్మితోపాటు 16మందిని కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం అందజేత

నూతనకల్ : మండల కేంద్రానికి చెందిన జర్నలిస్టు బోయిళ్ల చంద్రశేఖర్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా తోటి జర్నలిస్టులు మృతుడి కుటుంబ సభ్యులకు ఆదివారం ఆర్థిక సహకారం అందజేశారు. జర్నలిస్టులు దాతల సహకారంతో రూ. లక్ష 8వేల నగదును సమకూర్చి మృతుడి కుటుంబానికి అందజేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్టులు భూపతి రాములు, జలగం మల్లేష్, జంగా జానయ్య, మడ్డి మల్లేష్, సుందర్, మేడి కృష్ణ, జిల్లా రాములు, సైదులు తదితరులు పాల్గొన్నారు.



మృతుడి కుటుంబ సభ్యులకు ఆర్థికసాయం అందజేస్తున్న జర్నలిస్టులు

చెన్నాయిపాలెంలో ముత్యాలమ్మ జాతర

మఠంపల్లి : చెన్నాయిపాలెం గ్రామంలో గిరిజనులు ముత్యాలమ్మ జాతరను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని మహిళలు బోనాలతో ఊరేగింపుగా వచ్చి ముత్యాలమ్మకు పూజలు చేసి నైవేద్యం సమర్పించారు. అనంతరం కోళ్లు, మేకపోతులను బలిచ్చి మొక్కులను చెల్లించుకున్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు భూక్యా మంజీనాయక్, మాజీ జెడ్పీటీసీ నీలామంజీనాయక్, మాజీ సర్పంచ్‌లు భూక్యా నాగునాయక్, భూక్యా మారోని, గోవర్ధన్‌నాయక్, తులసీరామ్‌నాయక్, మాళోతు శ్రీనునాయక్, లోకనాధంనాయక్, రాహుల్‌నాయక్, రవీందర్‌నాయక్, ఈశ్వర్‌నాయక్, తదితరులు పాల్గొన్నారు.



ముత్యాలమ్మకు పూజలు చేస్తున్న గ్రామస్తులు

ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడిగా వెంకటేశ్వర్లు

గరిడేపల్లి : గడ్డిపల్లి గ్రామానికి చెందిన మేకల వెంకటేశ్వర్లు బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడిగా ఆదివారం నియమితులయ్యారు. ఈ సందర్భంగా మేకల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. హుజూర్‌నగర్ పట్టణంలో నిర్వహించిన సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు బొబ్బా భాగ్యరెడ్డి సమక్షంలో నియామకం చేసినట్లు తెలిపారు. పార్టీ అభివృద్ధి కోసం కృషి చేస్తానని ఆయన తెలిపారు.

మహిళల హక్కుల సాధనకు ఐద్వా పోరాటం



సమావేశంలో మాట్లాడుతున్న మల్లు లక్ష్మి

మునగాల : మహిళల హక్కులపై ఐద్వా నిర్విరామంగా పోరాడుతుందని ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని అమరవీరుల స్మారక భవనంలో నిర్వహించిన ఐద్వా మూడో మండల మహాసభలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా ఐద్వా మూడు లక్షల సభ్యత్వాలు కలిగి ఉందన్నారు. స్త్రీలపై సమాజంలో పెరుగుతున్న హింస, అసమానతలు, వివక్షలకు వ్యతిరేకంగా అన్ని జిల్లాలలో సంఘం అనేక పోరాటాలు చేస్తుందన్నారు. 498ఏ సెక్షన్, ఆస్తి హక్కు, జాతీయ, రాష్ట్ర మహిళా కమిషన్, స్థానిక సంస్థల రిజర్వేషన్‌లు సాధించడంలో ఐద్వా పాత్ర కీలకమన్నారు. ఈ సమావేశంలో సంఘం జిల్లా అధ్యక్షురాలు ఎలుగూరి జ్యోతి, కార్యదర్శి మేకబోయిన సైదమ్మ, దేశిరెడ్డి జ్యోతి, నాగేశ్వరమ్మ, ఖాజాబీ, విమల, లింగమ్మ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారమే లక్ష్యం

చిలుకూరు : ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా సీపీఎం పనిచేస్తుందని ఆ పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు జె.నరసింహారావు అన్నారు. ఆదివారం మండలంలోని ఆచార్యులగూడెం గ్రామంలో జరిగిన పార్టీ శాఖా మహాసభలో ఆయన మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేట్, కార్పొరేట్ సంస్థలకు ధారాదత్తం చేస్తోందని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నారు. అనంతరం పార్టీ నూతన గ్రామ శాఖ కార్యదర్శిగా గట్టు లింగయ్యను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సమావేశంలో పార్టీ మండల కార్యదర్శి నాగేటి రాములు, నాయకులు పిల్లి వీరమల్లయ్య, చంద్రయ్య, సురేష్, లక్ష్మి, సైదులు, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

మరమ్మతులకు నోచుకోక.. ప్రమాదకరంగా!



అలుగుపోస్తున్న కొత్తగూడెంలోని సుంచుకుంట



కోతకు గురవుతున్న చెరువు కట్ట

- కోతకు గురవుతున్న కొత్తగూడెం సుంచుకుంట కట్ట

అర్వపల్లి : జాజిరెడ్డిగూడెం మండలంలోని రామన్నగూడెం గ్రామ పంచాయతీ ఆవాసం కొత్తగూడెంలో సుంచుకుంట నిండి అలుగుపోస్తోంది. అయితే సుంచుకుంటలో కనీస మరమ్మతులు చేపట్టకపోవడంతో అలుగు ప్రాంతం ప్రమాదకరంగా మారింది. అంతేకాకుండా కుంట కట్టలు రెండు వైపులా కోతకు గురికావడంతో ఎప్పుడు ఏమి జరుగుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. ఈ కుంటకింద 50 ఎకరాల ఆయకట్టు ఉంది. గ్రామానికి రక్షిత పథకాల బోర్లకు కూడా ఈ కుంట నీటినే వినియోగిస్తున్నారు. గతంలో మిషన్ కాకతీయ పథకంలో కట్టకు మట్టి పోసి తాత్కాలికంగా మరమ్మతు చేయించారు. అప్పటి నుంచి మళ్లీ ఇంతవరకు కనీస మరమ్మతులు లేకపోవడంతో కట్టకు రెండు వైపులా కంపచెట్లు పెరిగాయి. వర్షాలకు వరద ప్రభావంతో కట్ట కోతకు గురవుతూ ప్రమాదకరంగా మారుతోంది.

మరమ్మతులు చేపట్టాలని వినతి..

సుంచుకుంట కట్టకు రెండు వైపులా మట్టి పోసి పటిష్ట పర్చాల్సి ఉంది. అలాగే కట్టకు ఇరువైపులా పెరిగిన కంపచెట్లను తొలగించాలి. కట్టపై మట్టిపోసి గుంతలను పూడ్చి చదును చేయించాలి. చెరువు నిండినప్పుడు అలుగు నీరు కూడా సాఫీగా వెళ్లడం లేదు. ఇప్పటికైనా సుంచుకుంటకు కనీస మరమ్మతులు చేపట్టాలని పలువురు రైతులు కోరుతున్నారు.

తెగిపోయే ప్రమాదం ఉంది



గ్రామంలో ఉన్న సుంచుకుంట కట్ట రెండు వైపులా కోతకు గురైంది. ఈ కట్టలకు గండ్లు పడే ప్రమాదం ఉంది. ప్రమాదం జరగక ముందే కట్టలకు మట్టి పోసి పటిష్ట పర్చాలి.

- రామసాని రవీందర్, కొత్తగూడెం

50ఎకరాల ఆయకట్టు



గ్రామంలోని సుంచు కుంట కింద 50 ఎకరాల ఆయకట్టు ఉంది. ఈ కుంట వల్లనే గ్రామంలోని బోర్లు, బావులకు నీరందుతుంది. భారీ వర్షాలు వస్తున్నందున కట్ట మరమ్మతులు చేపట్టాలి.

- రామ్మూర్తి, గ్రామస్తుడు

పీడీఎస్‌యూ ఉత్సవాలను విజయవంతం చేయాలి

కోదాడరూరల్ : అక్టోబర్ 24న నిర్వహించే పీడీఎస్‌యూ అర్ధశతాబ్ది ఉత్సవాలను విజయవంతం చేయాలని ఆ సంఘం పూర్వ విద్యార్థి రాయపూడి చిన్ని అన్నారు. ఆదివారం పట్టణంలోని ఎంఎస్ కళాశాల ఆవరణలో ఉత్సవాలకు సంబంధించిన లోగోను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. ఉస్మానియా యూనివర్సిటీలో మతోన్మాద విద్యార్థి సంఘాలకు వ్యతిరేకంగా పీడీఎస్‌యూ ఉద్భవించిందన్నారు. నాటి నుంచి దేశవ్యాప్తంగా సంఘం విస్తరించి విద్యార్థుల హక్కుల కోసం అనేక ఉద్యమాలు చేసిందని తెలిపారు. విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం పోరాడిందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ముత్తవరపు పాండురంగారావు, రాఘవరెడ్డి, నాగిరెడ్డి, అప్పిరెడ్డి, రాంబాబు, రామనర్సయ్య, డీఎన్ స్వామి, వెంకటేశ్వరరావు, నరసింహారావు, హరికిషన్, రంజాన్‌పాషా, భిక్షం, చందర్‌రావు, ఉదయగిరి, కిరణ్, సింహాద్రి పాల్గొన్నారు.



లోగో ఆవిష్కరిస్తున్న పీడీఎస్‌యూ నాయకులు

వరద బాధితులకు నిత్యావసర వస్తువుల పంపిణీ

కోదాడరూరల్ : వరదలతో నష్టపోయిన బాధితులకు కాంగ్రెస్ అండగా ఉంటుందని ఆ పార్టీ మండల అధ్యక్షుడు తూమాటి వరప్రసాద్‌రెడ్డి అన్నారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి విరాళంగా వచ్చి న నిత్యావసర వస్తువులను ఆదివారం మండల పరిధిలోని కూచిపూడి గ్రామంలో బాధితులకు అందజేసి ఆయన మాట్లాడారు. ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి పిలుపుతో అనేక మంది దాతలు ముందుకొచ్చి నిత్యావసర వస్తువులు అందజేశారని తెలిపారు. అదే విధంగా కూచిపూడి, తొగర్రాయిలో వరద బాధితులు, రైతులకు ఇబ్బంది లేకుండా ఎమ్మెల్యే ఆదేశాల మేరకు అధికారులు యుద్ధప్రాతిపదికన సహాయక చర్యలు చేపట్టారని అన్నారు. కార్యక్రమంలో పార్టీ ఉపాధ్యక్షుడు ఇర్ల సీతారాంరెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ రేఫూరి వెంకటాచారి, పీఏసీఎస్ ఛైర్మన్ ఓ.శ్రీనివాసరెడ్డి, శరభేశ్వరరావు, రెడ్డిపూడి అనంతరామయ్య, శెట్టి పూర్ణచందర్‌రావు, నాంచారయ్య, శ్రీనివాసరావు, తిరపతయ్య, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



నిత్యావసరాలు పంపిణీ చేస్తున్న వరప్రసాద్‌రెడ్డి

ఎస్సారెస్పీ జలాల రాకపై హర్షం

మోతె : మండలానికి ఎస్సారెస్పీ జలాలు చేరుకోవడంతో రైతులు ఆదివారం గంగమ్మతల్లికి కుంకుమ, పసుపు చల్లి కొబ్బరికాయలు కొట్టి ప్రత్యేక పూజలు చేశారు. ఎస్సారెస్పీ జలాలు రాకతో రైతుల ముఖాల్లో ఆశలు చిగురించాయి. వానాకాలం సీజన్‌లో మండలానికి తప్పకుండా ఎస్సారెస్పీ జలాలు వస్తాయనే నమ్మకంతో రైతులు ముందస్తు వరిపంటలు సాగు చేశారని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కీసర సంతోష్ పేర్కొన్నారు. జలాలకు పూజా కార్యక్రమంలో రైతులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.